www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 5 ఆగస్టు 2023

5

పశ్చిమ గోదావరి



సమగ్రంగా ఓటర్ సర్వే జరపాలి

మున్సిపల్ కమిషనర్ శ్యామల

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో ఓటర్ సర్వే సమగ్రంగా జరపాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల అన్నారు. స్థానిక భీమవరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ ఓటర్ సర్వే సమగ్రంగా జరపాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూడాలని, లేకుంటే సంబంధిత సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు ఎసిపి పి.గౌరు, రెవెన్యూ ఆఫీసర్ రంగారావు బిఎల్ఒ, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

మహిళలపై హింస అరికట్టే వరకూ పోరు

హింసను ప్రోత్సహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

బిజెపి హయాంలో మహిళలు, చిన్నారులపై పెరిగిన అఘాయిత్యాలు

మహిళా పోరుయాత్ర సదస్సులో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి



భీమవరం: మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

ప్రజాశక్తి - భీమవరం

మహిళలు, చిన్నారులపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోరు మెదపకుండా హింసను ప్రోత్సహించడం సిగ్గుచేటని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి విమర్శించారు. రోజురోజుకీ మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న హింసను ప్రభుత్వాలు అరికట్టాలని, లేనిపక్షంలో తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గత నెల 28న విశాఖపట్నంలో ప్రారంభమైన హింసపై మహిళల పోరుయాత్ర జిల్లా కేంద్రమైన భీమవరానికి శుక్రవారం మధ్యాహ్నం చేరుకుంది. స్థానిక చీడే సత్యనారాయణ (సిఎస్ఎన్) విద్యాసంస్థలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మజ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రభావతి విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. దేశ రాజధానిలో మహిళా రెజ్లర్లు చేసిన పోరాట తడి ఇంకా ఆరలేదన్నారు. మణిపూర్‌లో కుకీ తెగ మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశాన్నే కుదిపేస్తోందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఇవి మరింత పెచ్చరిల్లాయన్నారు. అధికార పార్టీ ఎంపీలు సైతం హత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్నా వారిని రక్షించేందుకు బిజెపి అధినేతలు తాపత్రయపడుతున్నారన్నారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల్లో ప్రధాన నిందితునిగా ఉన్న బ్రిజ్‌భూషణ్‌సింగ్‌పై బిజెపి అధిష్టానం ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం మహిళల పట్ల ఆ పార్టీ వైఖరిని ప్రతిబింబిస్తోందన్నారు. రాష్ట్రంలోనూ మహిళలపై ఇదే తరహాలో దాడులు జరుగుతున్నాయన్నారు. 2020లో కంటే 2021లో మహిళలపై నేరాలు 25 శాతం పెరిగాయన్నారు. నిర్భయ, దిశ కేవలం ప్రచార ఆర్భాటాలుగానే మిగిలిపోయాయన్నారు. మద్యం, మత్తు మందులు దీనికి ప్రధాన కారణమని తెలిసినప్పటికీ ప్రభుత్వం వాటిని అరికట్టడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పూర్తి మద్యపాన నిషేధం చేస్తామని జగన్ ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయిందన్నారు. సదస్సులో ఐద్వా రాష్ట్ర నాయకురాలు స్వరూపరాణి, జిల్లా కార్యదర్శి పి.పూర్ణ, యాత్ర బృందం, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

తొలుత ఈ యాత్రకు భీమవరం టౌన్‌షిప్ వద్ద ఘనస్వాగతం లభించింది. ఐద్వా, సిఐటియు నేతలు, ఆశాలు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అక్కడ నుంచి యాత్ర తాడేరు మీదుగా సోమేశ్వరస్వామి ఆలయం, భీమేశ్వరస్వామి ఆలయం, మావుళ్లమ్మ గుడి సెంటర్ల మీదుగా అంబేద్కర్ సెంటర్, ప్రకాశం చౌక్, పోలీస్ బొమ్మ సెంటర్, కొత్త బస్టాండ్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి మీదగా సిఎస్ఎన్ కళాశాల వరకు సాగింది. అక్కడ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.ఉదయకుమారి, నేతలు సరోజిని, లావణ్య, లక్ష్మి, శ్యామల, సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, ఎం.ఆంజనేయులు, ఎం.వైకుంఠరావు పాల్గొన్నారు.



నరసాపురంలో..

నరసాపురం టౌన్: మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి డిమాండ్ చేశారు. మహిళలపై హింసను నిరసిస్తూ ఐద్వా చేపట్టిన పోరుయాత్ర శుక్ర వారం ఉదయం చించినాడ నుంచి నరసాపురం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వాలు హింసను అరికట్టే వరకు పోరు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మణిపూర్‌లో కుకీ ఆడపడుచుల నగ్న ప్రదర్శన, ఢిల్లీలో శ్రద్ధావాకర్, బొంబాయ్‌లో సరస్వతి, చెరకుపల్లిలో అమర్నాథ్‌పై జరిగిన హత్యలు దేశాన్ని, సమాజాన్ని అప్రతిష్ట పాల్జేస్తున్నాయన్నారు. మహిళలకు, పిల్లలకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని, మహిళలపై జరుగుతున్న నేరాలను అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీ వేయాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారణ జరిపి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.పూర్ణ, సహాయ కార్యదర్శులు సత్యవతి, రమణి, స్వరూపరాణి, జిల్లా కోశాధికారి జయప్రభ, కళాకారులు దుర్గ, సుజాత, విజయ, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, ఐకెపి నేత నిర్మలాదేవి, సిఐటియు నేతలు అజయ కుమారి, పొన్నాడ రాము, ఎం.త్రిమూర్తులు పాల్గొన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఐద్వా రాష్ట్ర నేతలు మాట్లాడారు.

తాడేపల్లిగూడెం: హింసపై మహిళల పోరు యాత్ర శుక్రవారం రాత్రి పట్టణానికి చేరుకుంది. సీతారాంపేట వద్ద మహిళలు యాత్రకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ మాట్లాడారు. దేశంలో ఏదోక మూల ప్రతి నిమిషానికి ఒక అఘాయిత్యం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి యశోద, అధ్యక్షులు మీసాల పావని తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో..



డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉపాధ్యాయులకు జీతాలివ్వాలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - భీమవరం

బదిలీలు, ఉద్యోగోన్నతుల అనంతరం వచ్చిన సాంకేతిక సమస్యలతో ఉమ్మడి జిల్లాలో సుమారు 2000 మంది ఉపాధ్యాయులకు రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోయాయని, తక్షణం వారికి జీతాలు అందించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం డిఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా కోరుకున్న స్థానాలకు సంబంధించి కేడర్ స్ట్రింగ్ వివరాలు ఆర్థికశాఖకు చేరలేపోవడం వల్ల బిల్లులు కాలేదనారు. బదిలీలకు ముందు పిల్లలు లేని పాఠశాలల్లో పోస్టులు రద్దు చేసి అనంతరం తగినంత మంది ఉన్న చోటికి మార్పు చేశారన్నారు. ఆ స్థానాలకు సంబంధించిన సమాచారం ఆర్థికశాఖ ఖాతాల్లో చేరితేనే వేతనాలు చెల్లిస్తారని పేర్కొన్నారు. జూన్, జులైకు సంబంధించి వేతనాలు అందలేదని చెప్పారు. ఇంటి రుణాలు, వ్యక్తిగత రుణాలు తీసుకున్నవారు ప్రతి నెలా మొదటి వారంలో ఇఎంఐ చెల్లించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షురాలు శ్రీదేవి, అధ్యక్షులు మార్కండేయులు, కోశాధికారి పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు సాయిరాం, జయకుమార్, ఏసుబాబు, బాబు, ప్రసాద్, రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌టియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వద్ద ధర్నా

ఎస్‌టియు రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జీతాలు సకాలంలో చెల్లించలేని విద్యాశాఖ అధికారుల అలసత్వాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఎస్‌టియు ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణహోమంపై నిరసనలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమానికి వ్యతిరేకంగా ప్రజా సంఘాల నేతలు శుక్రవారం వేములదీవి సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతిభద్రతలు కాపాడలేని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. క్రైస్తవ మైనార్టీలపై అత్యాచారాలు, హత్యలు చేయడం హేయమైన చర్యగా అని విమర్శించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల శ్రీరామచంద్రుడు, జల్లి రామ మోహనరావు, జి.శ్రీరామ్మూర్తి, బి.వేణు, సిహెచ్.చిట్టిబాబు, పి.రామకృష్ణ, ఎం.నాగరాజు పాల్గొన్నారు.



తణుకులో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న నేతలు



నరసాపురం టౌన్ : నిరసన తెలుపుతున్న నేతలు

తణుకు రూరల్ : ప్రజల మధ్య మతం పేరుతో ఆర్ఎస్ఎస్, బిజెపి చిచ్చు పెడితే చూస్తూ ఊరుకోబోమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో మణిపూర్, హర్యానాలో జరుగుతున్న మత ఘర్షణలు నిరసిస్తూ కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాయ్, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ మూడు నెలలుగా మణిపూర్‌లో ఆర్ఎస్ఎస్, బిజెపి మూకలు కూకి తెగ ప్రజలపై సభ్యసమాజం తలదించుకొనేలా దాడులు చేస్తున్నా మోడీ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఈ దేశ ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రధాని బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. బిజెపి ఇంత మతోన్మాద చర్యలు చేపడుతుంటే రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన కనీసం ఖండించకపోవడం సిగ్గు చేటన్నారు. ఈ విధానాలను వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పి.దక్షిణామూర్తి, గుబ్బల గోపి, వల్లూరి వెంకటేశ్వర రావు, హర్షవర్ధన్, గోవింద రాజు, బ్రహ్మాజీ, సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాస్‌రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పిలవబడే పంచాయతీ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు విమర్శించారు. జిల్లా కలెక్టరేట్ వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పంచాయతీ కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో స్వీపర్లుగా, పంపు ఆపరేటర్లుగా, ఎలక్ట్రికల్ వర్కర్స్‌గా, డ్రైవర్స్‌గా, అటెండర్స్‌గా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. పంచాయతీ కార్మికుల సేవలు అమోఘమని సన్మానాలు చేసిన పాలకులు ఉద్యోగ భద్రత కల్పించడానికి, కనీస వేతనాలు ఇవ్వడానికి మీనమేషాలు లెక్కపెతోందన్నారు. టెండర్ల పేరుతో డబ్బులు వసూలు చేయడం, 40 ఏళ్లపైబడి సేవలందిస్తున్న వారిని తొలగించి కొత్తవారిని పెట్టుకోవడం వంటి దుశ్చర్యలు పంచాయతీల్లో జరుగుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. జిల్లాలోని పారిశుధ్య కార్మికులంతా సమస్యలు చెప్పుకునేందుకు జిల్లా కార్యాలయానికి వెళ్తున్నా అధికారులు అందుబాటులో ఉండడం లేదన్నారు. అధికారులు వచ్చేవరకూ ఉండటానికి ఏం అభ్యంతరం లేదని, కాకపోతే ఒక్కరే వెళ్లాలి, ఇద్దరే వెళ్లాలనే షరతుల మధ్య సామాన్యులు నలిగిపోయే పరిస్థితి ఎదురవుతోందని అన్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికుల ఆందోళనకు గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా అధ్యక్షులు బి.గణేశ్వరరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మిక సంఘం నాయకులు శివరాం, రాజారెడ్డి, రాజబాబు మాట్లాడారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లుల ఏసుబాబు, బెజవాడ సురేష్, శివ, కిరణ్, శివకృష్ణ, పోతురాజు, వీరాస్వామి, గిరి, శివాజీ సత్యనారాయణ, సిరిల్ కుమార్, విజయ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

పర్యాటకం అభివృద్ధికి చర్యలు

ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాద్ రాజు

ప్రజాశక్తి - భీమవరం

సిఆర్‌జెడ్ ప్రాంతాన్ని పక్కాగా గుర్తించి పర్యాటక అభివృద్ధికి ఇబ్బందుల్లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో నరసాపురం తీర ప్రాంతంలో నూతనంగా గుర్తించిన ఆరు బీచ్‌లను కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్లాన్‌లో చేర్చడానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అధ్యక్షతన జిల్లా పర్యాటక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ మ్యాప్‌లను రూపొందించే ముందు సిఆర్‌జెడ్ ప్రాంతాన్ని పక్కగా గుర్తించాలన్నారు. సముద్ర ప్రాంతానికి కిలోమీటర్ దూరంగా ఉన్న వేముల దీవి ప్రభుత్వ భూముల్లో టూరిజం అభివృద్ధికి చేపట్టనున్న ప్రాజెక్టుపై అభ్యంతరాలను విశదీకరించాలని కోరారు. అలాగే టూరిజం అభివృద్ధికి గోదావరి బండ్‌పై తలపెట్టిన ప్రాజెక్టును వెంటనే అమల్లోకి తేవాలన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో చేపల ఉత్పత్తి, మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది లేని రీతిలో పర్యావరణ అనుకూల బీచ్‌లను తీర్చిదిద్దాలన్నారు. జెసి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన రోస్టల్ జోన్ రెగ్యులేషన్ చట్టాన్ని అనుసరించి తీర ప్రాంతంలో బీచ్‌లు అభివృద్ధి చేస్తామన్నారు. ఫిషరీస్ విశ్వవిద్యాలయం, పర్యాటక, మత్స్యశాఖలతో కూడిన 11 ప్రత్యేక బృందాలు తీరం వెంట సర్వే నిర్వహించి బీచ్‌ల అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు. కోస్తా జిల్లాల్లో మొత్తం 288 బీచ్‌లను బృందాలు గుర్తించాయని, వాటిలో పశ్చిమగోదావరి జిల్లాలో 6 బీచ్‌లు గుర్తించినట్లు తెలిపారు. వాటిలో వేములదేవి బీచ్, పెదమైనవానిలంక బీచ్, కెపి.పాలెంబీచ్, పేరుపాలెం సౌత్ గ్రామ పంచాయతీలోని పేరుపాలెం బీచ్, పేరుపాలెం సౌత్ గ్రామ పంచాయతీలోని కనకదుర్గ బీచ్, పేరుపాలెం సౌత్ గ్రామ పంచాయతీలోని మోళ్లపర్రు బీచ్‌లు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బరాజు, డిఆర్ఒ కె.కృష్ణవేణి, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామినాయుడు, ఉభయ గోదావరి జిల్లాల టూరిజం అధికారి ఎండి హెచ్ మెహ్రాజ్, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

దళిత రక్షణ యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దళిత వ్యతిరేక విధానాలపై, దళితుల సామాజిక, ఆర్థిక హక్కులకై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని దళిత రక్షణ యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అన్ని దళిత, ప్రజా సంఘాలు, వామపక్షాలతో దళిత సమస్యలు, దళిత రక్షణ యాత్ర జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉభయ సంఘాల జిల్లా కార్యదర్శులు కె.క్రాంతిబాబు, జక్కంశెట్టి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తన మతోన్మాద ఎజెండాను శరవేగంగా అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ మత ఘర్షణలను మరింత పెంచుతోందన్నారు. అందుకు మణిపూర్ రాష్ట్రమే నిదర్శనం అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై తెలుగు రాజకీయ పార్టీలు ప్రశ్నించకపోవడం సిగ్గుచేటన్నారు. మెడికల్ సీట్లు భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 107, 108 జిఒలను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జిఒల వల్ల పేద విద్యార్థులు విద్యకు పూర్తిగా దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్, ఎపి జెఎసి కో ఛైర్మన్ దుండి అశోక్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల దళితులపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే దళిత రక్షణ యాత్రకు సంఘీభావం తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తవుతున్నా నేటికీ దళితులు ప్రాథమిక హక్కుల కోసం పోరాడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. కోనేరు రంగారావు కమిషన్ ప్రకారం ప్రతి దళిత కుటుంబానికీ రెండెకరాలు సాగు భూమి ఇవ్వాలని, నేటికీ ఎందుకు అమలు చేయడం లేదని పాలకపక్షాలను ప్రశ్నించారు. దళితపేటలో నేటికీ శ్మశానవాటికలు, రోడ్లు, కనీస మౌలిక సదుపాయాల్లేక దళితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో దళితులపై దాడులు చేసిన వారికి ఎంఎల్‌సి పదవులు కట్టబెట్టారని విమర్శించారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణ్, కెఎన్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రవీంద్ర మాట్లాడుతూ అసైన్డ్ భూముల చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దళితులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ నెల తొమ్మిదో తేదీన క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో భీమవరం జిల్లా కేంద్రంలో అన్ని దళిత ప్రజా సంఘాలతో కలిపి అంబేద్కర్ విగ్రహం వద్ద మతోన్మాద, కులోన్మాద దిష్టిబొమ్మలను దహనం చేయాలని వక్తలు తీర్మానించారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, సిపిఐ పట్టణ కార్యదర్శి చల్లబోయిన రంగారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, బహుజన జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బిరుదుగడ్డ రమేష్ బాబు, జైభీమ్ సేవాదళ్ ఫౌండర్ మీసాల జయరాజు, సాహితీ స్రవంతి జిల్లా నాయకులు చైతన్య ప్రసాద్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సువర్ణ రాజు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, ఉభయ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నేతలు

వైద్య విద్యను వ్యాపారం చేయడం సిగ్గుచేటు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రభుత్వం వైద్య విద్యను వ్యాపారం చేయడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.వాసు, డి.పెద్దిరాజు విమర్శించారు. పట్టణంలో సంఘం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైద్య విద్య సీట్ల భర్తీలో ప్రభుత్వం ఎర్రతివాచీ పర్చి బలహీన వర్గాల విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేస్తోందన్నారు. ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి 5 వైద్య కళాశాలలను ప్రారంభిస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించి నేడు ఆ కళాశాలలను వ్యాపార కేంద్రాలుగా తయారు చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 107, 108 జిఒల ద్వారా తేటతెల్లమవుతోందని తెలిపారు. 3 కేటగిరీలుగా సీట్లను భర్తీ చేసి వాటిలో 50 శాతం సీట్లు సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ కేటాయించడంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. 25 శాతం మాత్రమే రిజర్వ్ సీట్లు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుని పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎండి జాన్, టి.ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.మనోజ్, జిల్లా కమిటీ సభ్యులు పి.సాగర్, వి.భానుప్రకాష్, పి.శ్రీకాంత్, టి.రవి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక సత్యవతి నగర్ రోడ్లో సీసీ రోడ్డు నిర్మాణానికి, మహాలక్ష్మి నగర్ నాలుగో నంబర్ రోడ్డు నుంచి టిటిడి కళ్యాణ మండపం వరకూ బీటీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోతుల్లో రెండు బుట్టలు మట్టి, కంకర వేసి ఫొటోలు దిగితే రోడ్లు బాగు పడిపోవని, వాటిని ఏరకంగా బాగు చేయాలో ఆలోచించాలని తెలిపారు. టిడిపి, జనసేన డ్రామా కంపెనీలు వంటివని తెలిపారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని రోడ్లు పాడైపోయినప్పుడు ఐదేళ్లు ఏం చేశారని, గాడిదలు కాసారా అని మంత్రి కొట్టు ప్రతిపక్ష పార్టీలపై ధ్వజమెత్తారు. టిటిడి కళ్యాణ మండపానికి వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి చెట్ల రోడ్డు ప్రభుత్వాసుపత్రి వరకూ రూ.86 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. వీటితోపాటు కనకమహాలక్ష్మి గుడి వద్ద బాక్స్ కల్వర్టు నిర్మించి ప్రభుత్వాసుపత్రికి సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కోటీ 60 లక్షల రూపాయలతో చెట్ల రోడ్డుకు ఇరువైపులా సీసీ డ్రెయిన్ నిర్మాణం పూర్తయిందన్నారు.

మహాలక్ష్మి గుడికి పార్కు స్థలం కేటాయింపు

స్థానిక సత్యవతి నగర్‌లో కొలువైన మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నిర్మాణానికి గుడి కమిటీ విజ్ఞప్తి మేరకు ఆ పక్కనే ఉన్న పార్కు స్థలం కొంత కేటాయిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. స్థలం ఇచ్చినట్లయితే ఆలయాన్ని పునర్ నిర్మిస్తామని కమిటీ కోరడంతో దానికి సానుకూలంగా స్పందిస్తూ ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శామ్యూల్‌ను మంత్రి కొట్టు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొలుకులూరి ధర్మరాజు, వైసిపి నేతలు పాల్గొన్నారు.



పెనుమంట్ర : డస్టు బిన్లు పంపిణీ చేస్తున్న సర్పంచి

డస్టుబిన్లు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా గణపవరం నాలుగో సచివాలయం పరిధిలో ఇంటింటికీ తడి, పొడి చెత్త వేయడానికి వీలుగా వాలంటీర్లు శుక్రవారం డస్టు బిన్లు అందజేశారు. చెత్త వీధుల్లో వేయకుండా ఇచ్చిన డస్టు బిన్లలో వేసి చెత్తబండికి ఇవ్వాలన్నారు.

పెనుమంట్ర : స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకుంటోందని జుత్తిగ సర్పంచి తమనంపూడి వీరెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో 2100 డస్ట్ బిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఇంటికి రెండు చొప్పున డెస్టు బిన్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముసలయ్య, ఉప సర్పంచి మురళి, కొవ్వూరు చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - వీరవాసరం

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వీరవాసరం పిహెచ్‌సి వైద్యాధికారి పి.సత్యనారాయణరాజు సూచించారు. వీరవాసరం, కొణితివాడ పిహెచ్‌సిల పరిధిలోని నందమూరుగరువు, బలుసులగొయ్యిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవసరమైన వారికి బిపి, షుగర్, రక్త పరీక్షలు చేశారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వర్షాకాలంలో వచ్చే అంటు రోగాలపై అవగాహన కలిగించారు. గర్భిణులు కాన్పులకు ప్రభుత్వ వైద్యశాలలను వినియోగించుకోవాలన్నారు. కల్లకలకలు వ్యాపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు చుక్కల మందు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ చిట్టిబాబు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

మొగల్తూరు : కొత్తపాలెంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య వైద్యులు దినేష్ కుమార్ సుమారు 60 మందిని పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్యామల, హేమ దుర్గాదేవి, వాణిదుర్గ, రామకృష్ణ, ప్రభాకర్, సతీష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీను మృతి బాధాకరం : సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరంరూరల్

టిడిపి పట్టణ సీనియర్ నాయకులు కొండవీటి లక్ష్మీశ్రీనివాస్ మృతి బాధాకరమని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. ఆయనకు మృతికి సంతాపం తెలిపారు. శుక్రవారం ప్రయివేటు ఆసుపత్రిలో మృతి చెందిన శ్రీను భౌతికకాయాన్ని ఆయన స్వగృహం వద్దకు తీసుకొచ్చారు. ఆయన భౌతిక కాయానికి టిడిపి జెండాను కప్పి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి క్రియాశీల రాజకీయాల్లో అడుగుపెట్టిన కొండవీటి శ్రీను జిల్లా ఉపాధ్యక్షునిగా, వివిధ ఆలయాల ధర్మకర్తగా, ఎఎంసి డైరెక్టర్‌గా అనేక పదవులను బాధ్యతాయుతంగా నిర్వర్తించారని తెలిపారు. ఆయన మరణం పార్టీకి తీరనిలోటని అన్నారు. మాజీ ఎంఎల్‌సి బొమ్మిడి నారాయణరావు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి డ్వాక్రా అంగన్‌వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, మాజీ ఎంపిపిలు బర్రె నెహ్రూ సంతాపం తెలిపారు.

నిలిచిన టైలర్ భవన నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు హౌసింగ్ బోర్డులో నిర్మాణంలో నిలిచిపోయిన టైలర్స్ బిల్డింగ్‌ను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు శుక్రవారం పరిశీలించారు. టైలర్లు వారి కష్టార్జితంతో అల్లు వెంకట సత్యనారాయణ ఇచ్చిన స్థలంలో కొంతవరకూ స్లాబ్ వేశారు. నిర్మాణం నిలిచిపోయిన స్థితిలో టిడిపి హయాంలో బిసి కార్పొరేషన్ నుండి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ధర్మారావు ఫౌండేషన్ ద్వారా నిర్మించాలని టైలర్స్ తనను కోరారని, వాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు.

ఐటిఐ విద్యార్థులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

బ్రాహ్మణ చెరువు శ్రీనివాస శైల ఐటిఐ ప్రాంగణంలో కిసాన్ మార్ట్ గోదావరి అగ్రికల్చర్ మిషనరీ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ సర్వీస్, డ్రోన్ టెక్నాలజీ తాడేపల్లిగూడెం వారు శుక్రవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూ ద్వారా కొంతమంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ ఎన్‌వి.రమణ, సెక్రటరీ, కరస్పాండెంట్ ఎన్‌విజి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ ఎన్.లోకేష్‌వర్మ, ఎన్.గణపతిరావు, ఎన్‌వి.ప్రభాకర్, వికె.చైతన్య పాల్గొన్నారు.

పాలకొల్లు జెసిఐకు పలు అవార్డులు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఒంగోలులో జరిగిన జెసిఐ జోన్ సమావేశంలో పాలకొల్లు జెసిఐకు 22 అవార్డులు వచ్చాయి. ఈ సందర్భంగా పాలకొల్లులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలువురు జెసిఐ జోన్ అధ్యక్షులు డాక్టర్ కావలి మౌనిని అభినందించారు. అధ్యక్షులు ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగిన మిడ్ ఖాన్ సమావేశంలో జెసిఐ పాలకొల్లు రేసింగ్ డాక్టర్ కావలి మౌని సారథ్యంలో చేసిన సేవా కార్యక్రమాలకు, శిక్షణ, ప్రాజెక్టులకు 2 అవార్డులు సొంతం చేసుకున్నామన్నారు. మౌని మాట్లాడుతూ జెసిఐ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.

'రానున్న ఎన్నికల్లో టిడిపిదే విజయం'

ప్రజాశక్తి - పాలకోడేరు

భవిష్యత్తుకు దారి చూపే పార్టీ తెలుగుదేశమేనని ప్రజలు విశ్వసిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో టిడిపి ప్రభంజనం చాటడం ఖాయమని అర్థమవుతుందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. పెన్నాడ గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు చేబోలు రామకృష్ణ, గ్రామ అధ్యక్షుడు ప్రసాద్ నేతృత్వంలో టిడిపి మిని మేనిఫెస్టోపై మహిళాశక్తి పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ వచ్చిన జగన్ రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పులపర్తి రామాంజనేయులు, దాసరి పెంటయ్య, శ్రీదేవి, ఆరేపల్లి నాగలక్ష్మి, నాగూర్ సాహేబ్, బైరెడ్డి నరసింహరావు, నడిపూడి అప్పారావు, కృష్ణ పాల్గొన్నారు.

పేద మహిళకు తోపుడు బండి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు యడ్ల బజార్‌లో పువ్వుల వ్యాపారం చేసుకునే మహిళకు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ శుక్రవారం తోపుడు బండి అందించారు. పట్టణంలో రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేసుకునేవారిని ఏ అధికారైనా ఇబ్బంది పెడితే తన దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు పాల్గొన్నారు

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని జాతీయ రహదారి దొంగరవిపాలెం వద్ద విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి కరుణకుమార్ ఆదేశాల మేరకు వివిధ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రవాణా శాఖ అధికారి జి.సంజయ్‌కుమార్, విజిలెన్స్ సిఐ బి.రామకృష్ణ, సివిల్ సప్లై అధికారి పి.నాగరాజు పాల్గొన్నారు.

'చంద్రబాబుపై దాడి దారుణం'

పాలకొల్లు : పుంగనూరులో చంద్రబాబుపై దాడికి నిరసనగా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి నేతలు శుక్రవారం రాత్రి కాగడాల ప్రదర్శన చేశారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ సారథ్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కర్నేని గౌరునాయుడు, మామిడిశెట్టి పెద్దిరాజు, పెచ్చెట్టి బాబు, కోడి విజయ భాస్కర్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సౌకర్యాలు కరువు..!

ప్రజాశక్తి - పెనుమంట్ర

నెగ్గిపూడి గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కూర్చోవడానికి బెంచీలు కూడా సరిగ్గా లేని పరిస్థితి. దీంతో చెట్ల కింద నేలపైనే విద్యాభ్యాసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెగ్గిపూడి గురుకుల పాఠశాలలో ఆలమూరు, కొడమంచిలి, పోలమూరు, చింతలపూడి, ఏలూరు, సిద్ధాంతం, దొంగరావిపాలెం, ఇరగవరం, నరసాపురానికి చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఇక్కడ ఐదో తరగతి నుండి పదో తరగతి వరకూ 199 మంది విద్యార్థులు

విద్యార్థుల అవస్థలు

విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రిన్సిపల్ చింతపల్లి వాణిని వివరణ కోరగా బెంచీల ఏర్పాటు, మౌలిక సదుపాయాల గురించి అధికారులకు చెబుతున్నామని తెలిపారు.




చెట్టు కింద విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

ప్రొఫెసర్ ఝాన్సీరాణికి డాక్టరేట్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రముఖ రచయిత్రి, భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సిహెచ్.రూపా ఝాన్సీరాణికి కెఎల్ యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. శుక్రవారం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఝాన్సీ రాణిని యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రూపా ఝాన్సీరాణి మాట్లాడుతూ భారతి ముఖర్జీ 1971 లో టైగర్స్ డాటర్, 1975లో వైఫ్, 1989లో జాస్మిన్, 1993లో ద హోల్డర్ ఆఫ్ ది వరల్డ్, 2002లో డిజైరబుల్ డాటర్ అనే నవల్స్‌లో ఆమె భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఇనుమడింప చేస్తూనే, విదేశాలలో ఉన్నప్పటికీ జఠిలమైన సమస్యలు అధిగమిస్తూ భారతీయ సంస్కతికి ప్రాధాన్యత ఇస్తూనే మంచి రచయితగా పేరు తెచ్చుకున్నట్లు తెలిపారు. డయాస్పోరిక్ విక్సిస్ టూడ్స్ ఇన్ ది సెలెక్ట్ నోవల్స్ ఆఫ్ భారతి ముఖర్జీ' అంశంపై కెఎల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పివి రవికుమార్ పర్యవేక్షణలో తాను రూపొందించిన పరిశోధనకు కెఎల్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు.



ఝాన్సీరాణిని సత్కరిస్తున్న కాలేజీ యాజమాన్యం

జనసేన నేతలది జంబలకడిపంబ తీరు : ఎంఎల్ గ్రంథి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గునుపూడి జగనన్న కాలనీ భూసేకరణలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేసిన జనసేన నాయకులను చూస్తే జంబలకిడిపంబ సినిమా గుర్తొస్తోందని ఎంఎల్ఎ గ్రంథి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు జగనన్న కాలనీలు నిర్మిస్తున్నామని, ఇందుకు తాము భూములు సేకరించి మౌలిక వసతులు కల్పిస్తుంటే మీకెందుకు నొప్పులంటూ జనసేన నాయకులను విమర్శించారు. జంబలకిడిపంబగాళ్లందరూ జనసేనలోనే ఉన్నారన్నారు. తాతల నుండి దానధర్మాలు చేసే కుటుంబం తమదని, జూనియర్ కాలేజీకి 35 సెంట్ల స్థలం ఇచ్చామని, వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి నాలుగు ఎకరాల భూమిని తమ కుటుంబం కొనుగోలు చేసి ఇచ్చిందని తెలిపారు. ఆ భూమిని పూడ్చడానికి మరో రూ.15 లక్షలు సొంతంగా ఇచ్చామని తెలిపారు. అభివృద్ధిని చూడలేని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడి పై అధర్మయుద్ధం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన అందించాలన్న లక్ష్యంతో ప్రజాసమస్యలను స్వయంగా తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించాలన్న వినూత్న ఆలోచనతో ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. భీమవరం నియోజకవర్గంలో మొత్తం 92 వేల 82 కుటుంబాలను సర్వే చేసి లక్షా 2 వేల 83 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందించి పశ్చిమగోదావరి జిల్లాలోనే మొదటి స్థానం దక్కించుకుందని తెలిపారు. సమావేశంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, నేతలు పాల్గొన్నారు.

బిడ్డకు ముర్రుపాలు శ్రేష్టం

ప్రజాశక్తి - గణపవరం

బిడ్డకు ముర్రుపాలు శ్రేష్టమని పిహెచ్‌సి సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు అన్నారు. సరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బాలింతలకు, గర్భిణులకు వైఎస్ఆర్ పోషకాహార కిట్లు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాటుక ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్ జి.శ్రీనివాస్, ఆశాలు పాల్గొన్నారు.

ఆచంట : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, టేక్ హోమ్ రేషన్, తల్లిపాల వారోత్సవాలు వల్లూరులో ఘనంగా నిర్వహించారు. ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను లావణ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి, ఎంపిటిసి ఏడిద రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, తల్లిపాల వల్ల బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటాడని మహదేవపట్నం గ్రామ సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి అన్నారు. మహదేవపట్నంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి మాట్లాడారు. తల్లిపాలల్లో బిడ్డకు అవసరమైన పోషకాలు, ప్రొటీన్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తోందని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ అన్నారు. శుక్రవారం జగన్నాథపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహార కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కనుమూరి ఆంజనేయరాజు, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : గర్భిణులు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని మహదేవపట్నం గ్రామ సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహదేవపట్నంలో ఏర్పాటుచేసిన పోషకాహారం పంపిణీ కార్యక్రమంలో సర్పంచి వర్మ నాగ వెంకట సుబ్బలక్ష్మి పాల్గొని మాట్లాడారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టిడిపితోనే భవిష్యత్తుకు భరోసా : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఉండి

టిడిపితోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. శుక్రవారం పాములపర్రు గ్రామంలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ మంతెన రామరాజు అంబేద్కర్, ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ పరిశ్రమలు లేక యువతకు ఉపాధి దొరక్క పక్క రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుకు మద్దతు తెలిపితే యువత భవిష్యత్తుకు ఢోకా ఉండదని అన్నారు. మహిళా సాధికారత చంద్రబాబు తోనే సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల మహిళ అధ్యక్షురాలు వత్సవాయి సుజాత, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, నాయకులు కిన్నెర వెంకన్న, కేశన యాదగిరి, కన్నెగంటి రూత్ కళ పాల్గొన్నారు.



కాళ్ల : 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు

కాళ్ల: వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రంలో అభివృద్ధి తిరోగమనం బాట పట్టిందని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. పెద అమిరం గ్రామంలో టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జైన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలోని పురవీధుల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని తెలిపారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి, చెత్త పన్ను వివరాలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, మౌలిక వసతులు విస్మరించి రాష్ట్ర అభివృద్ధిని అధోగతి పాల్జేస్తోందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తేనే ప్రజలు సమస్యలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, యూనిట్ ఇన్‌ఛార్జులు తోట ఫణిబాబు, వీరవల్లి శ్రీనివాసరావు, నాయకులు ముదుండి ఉషాకుమారి, కఠారి నరసింహరాజు, టి.లీలావతి, ఎం.రాజేష్, గ్రామ అధ్యక్షుడు కాలవ వెంకటరావు, వేణుగోపాలరావు, జోగయ్య, మంతెన రామరాజు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పాలకోడేరు

తల్లి పాలు పట్టిస్తే బిడ్డకు ఎంత ఆరోగ్యమో పాలిచ్చిన తల్లికి కూడా అంతే ఆరోగ్యమని హెల్త్ సూపర్‌వైజర్ అమ్మాజీ అన్నారు. మండలంలోని గొరగనమూడిలో తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అమ్మాజీ మాట్లాడుతూ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధశక్తి వస్తుందన్నారు. ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలు ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ప్రమోద, ఆరోగ్య సహాయకులు ఎం.విజయప్రసాద్, ఎఎన్ఎంలు వేదకుమారి, సుజాత, ఆశా వర్కర్ శాంతి, కుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కుముదవల్లిలో అన్నదానం

ప్రజాశక్తి -పాలకోడేరు

మండలంలోని కుముదవల్లిలో ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఆలయం వద్ద దాతల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు ఆలయ కమిటీ వారు అభినందనలు తెలిపారు.

టిడిపితోనే మహిళా సాధికారత

పాలకొల్లు రూరల్ : టిడిపితోనే మహిళా సాధికారత సాధ్యమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని దిగమర్రు, కొత్తపేట గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన మహాశక్తి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోలో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలన్నారు. మహాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి మ్యానిఫెస్టో వివరించారు. ఈ కార్యక్రమంలో కర్నేని రోజారమణి, సర్పంచి చొప్పల రజిని, ఎంపిటిసి సభ్యులు ఆకుల ధనలక్ష్మి, ద్రాక్షారపు జ్యోతి, తమ్మా లక్ష్మి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పాలకొల్లు రూరల్ : వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధ్యక్షురాలు చిట్టూరి కనకలక్ష్మి అన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. ఈ సందర్భంగా కనకలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వైద్య సిబ్బంది కూడా గ్రామీణ ప్రాంతంలో వ్యాధులను గుర్తించి ఎప్పటికప్పుడు వైద్య సహాయం అందించాలన్నారు. డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా ప్రతిఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.పెద్దిరాజు, ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు, చిట్టూరి ఏడుకొండలు, దగ్గులూరు సర్పంచి వాసా కనకభద్రం, మండల ఉపాధ్యక్షులు ఎన్నాబత్తుల నాగేశ్వరరావు, కర్ని జోగయ్య, డాక్టర్ భవానిప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.రమేష్‌బాబు పాల్గొన్నారు.

డైమండ్స్ లయన్స్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో శుక్రవారాం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, లార్డ్స్ ఆఫ్ లైఫ్‌లో విద్యార్థులకు క్లాత్ బ్యాగ్స్ అందించారు. ప్రగతి జూనియర్ కాలేజ్ తరపున విద్యార్థులకు స్నాక్స్, డ్రింక్స్, స్టేషనరి అందించారు. ఈ సందర్భంగా జోన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్స్ ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకంగా మారాయన్నారు. క్లబ్ ట్రెజరర్ మునగాల జితేంద్ర మాట్లాడుతూ వశిష్ఠ లియో క్లబ్స్ ప్రజల అవసరాలు తీర్చే విధంగా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో కుందుం వెంకటేశ్వరరావు, కె.సత్యనారాయణ రాజు, లియో సాయి శృతి, యర్రా ఆంజనేయ స్వామి, లియో సంపత్, లియో అంబికా, లియో ధనలక్ష్మి పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

పాలకోడేరు : పంట కోత ప్రయోగాలపై మండల కేంద్రమైన పాలకోడేరులో శిక్షణ కార్యక్రమాన్ని మండల గణాంక అధికారి గోపాలకృష్ణంరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎడిఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలపై కేంద్ర ప్రభుత్వం ఈ ప్రయోగాలను పరిగణలోకి తీసుకోబోతుందన్నారు. ఎటువంటి విపత్తులు వచ్చినా ఈ పంట కోత ప్రయోగం ద్వారానే గణాంకాలను ప్రామాణికంగా తీసుకుటుందన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా, వైఎస్ఆర్ ఉచిత పంట బీమా తదితర లెక్కలను ఈ పంట కోత ప్రయోగాలను ఆధారంగా చేసుకుని తీసుకుంటారన్నారు.

బాలికలకు పలు విషయాలపై అవగాహన

కాళ్ల : బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లపై బాలికలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆకివీడు సిఐ కెవివిఆర్.సత్యనారాయణ అన్నారు. ఏలూరుపాడు జెడ్‌పిహెచ్ స్కూల్లో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు భీమవరం సబ్ డివిజన్ డిఎస్‌పి పర్యవేక్షణలో ఆకివీడు సిఐ సత్యనారాయణ, కాళ్ల ఎస్ఐ మూర్తి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైస్కూల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న బాలికలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై, సైబర్ క్రైమ్, పోక్సో కేసులు గురించి అవగాహన కల్పించారు.

ఎస్ఎన్ఎం డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జులైలో జరిగిన రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి శుక్రవారం విడుదల చేశారు. రెండో సెమిస్టర్‌లో మొత్తం 82 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, నాలుగో సెమిస్టర్‌లో 68 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.కృష్ణ, సిహెచ్.ఉషారాణి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని శ్రీ మన్యం జగ్గమ్మ సత్రం ఆధ్వర్యంలో వీవర్స్ కాలనీలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు శుక్రవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్రం ఛైర్మన్ నంబూరి గంగా పవన్ కుమార్, ట్రస్టీలు పోకల వెంకటేశ్వరరావు, కడలి రామలక్ష్మి, స్కూల్ హెచ్ఎం భవానిప్రసాద్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.